## • 'డబుల్ ఇండ్ల'కు ట్యాంకరే దిక్కు!



*నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి*

## • పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



*రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట*



*గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు*

# గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

# గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



*ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు*



*ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం*

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ–1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.




*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు*

# దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

## సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

### జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



*వీర్ల నర్సవ్వ*



*ఆది రాజవ్వ*

## మహా కుంభమేళాకు వెళ్లి ..

### తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలు దేరినట్టు తెలిసింది.



## ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్‌ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

# ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.



*లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు*

# ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

### వివరాలు వెల్లడించిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీసు అధికారులు



*లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు*

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీస్ అధికారులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ పరిధిలో అనేక విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్న వీరు మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై అసంతృప్తి చెందడంతోపాటు నిత్యం పోలీసు శాఖ నిర్వహిస్తున్న కూంబింగ్ ఆపరేషన్స్, మావోయిస్టుల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతో పాటు ముగ్గురు మావోయిస్టులపై ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస పథకం కింద ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున ప్రోత్సాహకం అందించారు. డీఐజీ విపుల్ మోహన్ బాలా(డీఎస్‌ఎఫ్ కన్హర్‌గావ్ సెక్టార్), అదనపు ఎస్పీ సందీప్ పటేల్(భానుప్రతాప్‌పూర్), అదనపు ఎస్పీ దినేష్ సిన్హా(కాంకేర్), ఇతర పోలీస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యమించాలి

### మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య




*మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య*

ఇల్లెందు/ ఇల్లెందు రూరల్, జనవరి 31: సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులు తమకు చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు, వేతనాల కోసం ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండవ మహాసభ శుక్రవారం ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ భవన్‌లో జరిగింది. గుమ్మడి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెరగడం లేదని, సింగరేణి యాజమాన్యం నుంచి చట్టబద్ధమైన హక్కులు కూడా అమలవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై యాజమాన్యం శీతకన్ను వేయడం సరికాదని అన్నారు. సింగరేణికి వస్తున్న లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ కూడా ఉందన్న సత్యాన్ని సింగరేణి యాజమాన్యం గుర్తించాలన్నారు. సమాన వేతనాలకు, చట్టబద్ధ హక్కుల సాధనకు కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు సూర్యం, యాకూబ్‌షావలి, తోకల రమేష్, మధుసూదన్ రెడ్డి, సతీష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పేపర్‌లెస్ విధానంపై శిక్షణ



*మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్*

మణుగూరు టౌన్, జనవరి 31: సింగరేణి వ్యాప్తంగా శనివారం నుంచి అమలు కానున్న పేపర్‌లెస్ విధానంపై ఏరియా ఉన్నత అధికారులకు, ఆయా విభాగాల అధికారులకు సింగరేణి ఐటీ విభాగం ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో ఒకరోజు శిక్షణ ఉంటుందని మణుగూరు ఏరియా ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా డీజీఎం హరప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సంస్థ వ్యాప్తంగా ఉత్తర, ప్రత్యుత్తరాలు, సర్క్యులర్‌లు, కాగితాలపై జరుగుతూ ఉన్నాయని ఇకపై అన్ని రకాల ఉత్తర, ప్రత్యుత్తరాలు, సాప్ ద్వారా మాత్రమే జరగడానికి సాప్ ఫైల్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే ప్రోగ్రాంను తయారు చేశబూమన్నారు. దీని వినియోగం వల్ల సమయం చాలా వరకు ఆదా అవడమే కాక కాగితం వాడకం పూర్తిగా తగ్గించుకోవచ్చన్నారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం శ్యాంసుందర్, ఏజీఎం వెంకటేశ్వర్లు, పీవో శ్రీనివాసచారి, డీజీఎం రమేష్, ఏఎస్‌వో వెంకట రామారావు, డీజీఎం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

# ఐటీసీ 'గుర్తింపు' ఎన్నికల్లో.. రెండోసారి టీఎన్‌టీయూసీ విజయం

- 480 ఓట్లతో టీఎన్‌టీయూసీ మిత్రపక్షాల గెలుపు
- 310 ఓట్లతో రెండోసారీ ఉనికి చాటిన బీఆర్‌టీయూ
- అధికార పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీకి 420 ఓట్లే





*కార్మికులను ఓటింగ్ సరళి అడిగి తెలుసుకుంటున్న రేగా కాంతారావు, విక్టరీ చూపుతున్న కనకమేడల హరిప్రసాద్*

బూర్గంపహాడ్, జనవరి 31: సారపాక ఐటీసీ పేపర్ కర్మాగారంలో శుక్రవారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలు విజయం సాధించాయి. ఇప్పటికే 2021 ఎన్నికల్లో గెలిచిన టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలు.. తాజా ఎన్నికల్లోనూ విజయాన్ని అందించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మొత్తం 1253 ఓట్లకు గాను 1252 ఓట్లు పోలయ్యాయి. ఒక ఓటు పోల్ కాలేదు. పోలైన 1252 ఓట్లలో మూడు ఓట్లు ఇన్‌వాలిడ్ అయ్యాయి. మొత్తం 1249 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు సాయంత్రం 6:30 గంటలకల్లా ఓట్ల లెక్కింపును పూర్తిచేసి ఫలితాన్ని వెల్లడించారు. ఐదు కార్మిక సంఘాలైన బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీఈయూ, బీఎంఎస్‌లు ఈ ఎన్నికల్లో పోటీచేశాయి. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా ఉన్న కనకమేడల హరిప్రసాద్‌కు 480 ఓట్లు వచ్చాయి. 60 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు. అయితే ఐఎన్‌టీయూసీకి 420, బీఆర్‌టీయూకి 310, బీఎంఎస్‌కు 21, టీఈయూకు 18 ఓట్లు పోలయ్యాయి.

**రెండోసారీ ఉనికి చాటిన బీఆర్‌టీయూ మిత్రపక్షాలు..**

ఐటీసీ గుర్తింపు సంఘానికి 2021 ఎన్నికల్లో బీఆర్‌టీయూ తొలిసారిగా పోటీచేసి 191 ఓట్లు సాధించింది. అయితే తాజా ఎన్నికల్లో బీఆర్‌టీయూ మిత్రపక్షం మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాయి. 45 ఏళ్లుగా ఐటీసీ ఎన్నికల్లో హవా చాటుతున్న టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీలతో పోటీపడి 310 ఓట్లు సాధించి ఉనికిని చాటుకున్నాయి. అయితే రాష్ట్రంలో అధికార పార్టీ కాంగ్రెస్ అండగా ఉన్నప్పటికీ దాని అనుబంధ ఐఎన్‌టీయూసీ మాత్రం ఓటమిని చవిచూసింది. గతంలో గెలిచిన అనుభవం ఉన్నప్పటికీ తాజా ఎన్నికల్లో 420 ఓట్లకు పరిమితమై పరాజయం పొందింది. కానీ ఈ ఎన్నికల్లో బీఆర్‌టీయూ 310 ఓట్లు సాధించడంతో కార్మికుల్లో మద్దతు పెరిగిందని పలువురు చర్చించుకుంటున్నారు.

**భారీగా పోలీసు బందోబస్తు**

ఈ ఎన్నికలకు పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. 10 మంది సీఐలు, 10 మంది ఎస్సైలు, 45 మంది కానిస్టేబుళ్లు, 30 మంది హోంగార్డులు, 15 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లతో బందోబస్తును కట్టుదిట్టం చేశారు. బూర్గంపహాడ్ ఎస్సై రాజేశ్ పర్యవేక్షించారు.

**కార్మిక నేతల శిబిరాన్ని సందర్శించిన 'రేగా'**

బీఆర్‌టీయూ మిత్రపక్షాల శిబిరాన్ని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సందర్శించారు. బీఆర్‌ఎస్, బీఆర్‌టీయూ నాయకులతో చర్చించి ఓటింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. నాయకులు కుర్రి నాగేశ్వరరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్, కొనకంచి శ్రీనివాసరావు, మేడిగం లక్ష్మీనారాయణరెడ్డి, జక్కం సర్వేశ్వరరావు, బొల్లు సాంబ, గుల్‌మహ్మద్, ఖాదర్, పంగి రమేశ్, చల్లకోటి పూర్ణ, సానికొమ్ము లక్ష్మీచైతన్యరెడ్డి, సాలయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## వంద శాతం బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, జనవరి 31: సింగరేణివ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరం జనవరిలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించి వంద శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది. సంస్థవ్యాప్తంగా 11 ఏరియాల్లో జనవరి నెలకు 67,27,501 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. లక్ష్యాన్ని మించి 67,39,713 టన్నులు ఉత్పత్తయింది. ఏరియాలవారీగా కొత్తగూడెంలో 13,13,421 టన్నులకు గాను 13,11,020 టన్నులు (100 శాతం), ఇల్లెందులో 4,30,000 టన్నులకుగాను 3,66,976 టన్నులు (87 శాతం), మణుగూరులో 11,32,693 టన్నులకుగాను 13,54,475 టన్నులు (120 శాతం), బెల్లంపల్లిలో 4,03,846 టన్నులకుగాను 4,20,308 టన్నులు (104 శాతం), మందమర్రిలో 2,76,923 టన్నులకుగాను 2,53,594 టన్నులు (92 శాతం), శ్రీరాంపూర్‌లో 5,42,981 టన్నులకుగాను 7,09,732 టన్నులు (131 శాతం), ఆర్జీ1లో 4,33,942 టన్నులకుగాను 4,83,105 టన్నులు (111 శాతం), ఆర్జీ2లో 10,41,058 టన్నులకుగాను 8,89,693 టన్నులు (85 శాతం), ఆర్జీ3లో 5,65,385 టన్నులకుగాను 5,64,023 టన్నులు (100 శాతం), అడ్రియాలా ప్రాజెక్టులో 17,596 టన్నులకుగాను 10,887 టన్నులు (62 శాతం), భూపాలపల్లిలో 5,69,616 టన్నులకుగాను 3,75,900 టన్నులు (66 శాతం).. మొత్తం 67,27,501 టన్నులకుగాను 67,39,713 టన్నులు ఉత్పత్తి జరిగింది.

## ఎంపీటీసీ స్థానాలు సర్దుబాటు




*పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎంపీడీవో*

అశ్వారావుపేట, జనవరి 31: అశ్వారావుపేట మేజర్ పంచాయతీ.. మున్సిపాలిటీగా మారినందున ఎంపీటీసీ స్థానాలను సర్దుబాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఆయన శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. అశ్వారావుపేట, పేరాయిగూడెం పంచాయతీల పరిధిలో ఆరు ఎంపీటీసీ స్థానాలను పూర్తిగా తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతమున్న 17 స్థానాలను 11కు కుదించినట్లు చెప్పారు. వీటి పరిధిలోగల పాత అల్లిగూడెం పంచాయతీని ఊట్లపల్లి ఎంపీటీసీ స్థానంలో, వేదాంతపురం పంచాయతీని వినాయపురంలో కలుపుతున్నట్లు వివరించారు. దీనిపై పార్టీల ప్రతినిధుల నుంచి అభ్యంతరాలను, ప్రతిపాదనలను, సూచనలను స్వీకరించారు.

## ఎఫ్‌ఆర్‌ఎస్‌లో డీఎఫ్‌వో తనిఖీ

### 'నమస్తే' ఎఫెక్ట్



*మొట్ల ఫొటోలు తీసుకుంటున్న డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్*

అశ్వారావుపేట, జనవరి 31: మండలంలోని అచ్యుతాపురం ఫారెస్ట్ రీసెర్చ్ స్టేషన్(ఎఫ్‌ఆర్‌ఎస్)ను డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. రక్షణ చర్యలను పరిశీలించారు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో విలువైన టేకు, వెదురు, ఇతర జాతి చెట్లు చోరీ అయ్యాయంటూ 'నమస్తే తెలంగాణ' లో శుక్రవారం 'ఎఫ్‌ఆర్‌ఎస్‌లో దొంగలు పడ్డారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీఎఫ్‌వో.. ఎఫ్‌ఆర్‌ఎస్‌ను సందర్శించారు. టేకు, వెదురు తదితర చెట్ల మొట్లు పరిశీలించి, వాటిని తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు. రేంజర్ వెంకటేశ్వర్లు నుంచి వివరాలు తెలుసుకున్నారు. 2020 కోవిడ్ కాలంలోనే ఈ చెట్లు చోరీ అయ్యాయని, దీనిని అప్పటి డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లామని రేంజర్ చెప్పారు.

## ఉడ్ బాల్ జాతీయ స్థాయి జట్టుకు మనోడు

కొత్తగూడెం అర్బన్, జనవరి 31: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగిన ఉడ్ బాల్ పోటీల్లో కొత్తగూడెం పట్టణానికి చెందిన క్రీడాకారుడు జశ్వంత్ ప్రతిభ చాటి, జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. కంబైన్డ్ టీంలో రాష్ట్ర జట్టు విజయం సాధించింది. మార్చి 22 నుంచి 26వ తేదీ వరకు నాగపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టులో స్థానం సంపాదించాడు.